www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 7 జనవరి 2025

5

ఏలూరు

జిల్లా అటవీ శాఖాధికారిగా శ్రీశుభమ్ బాధ్యతల స్వీకరణ

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీశుభమ్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా అటవీశాఖ అధికారిగా శ్రీశుభమ్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి శ్రీశుభమ్‌కు అభినందనలు తెలిపారు. అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు సబ్ డివిజన్ నుండి బదిలీపై ఏలూరు జిల్లా అటవీశాఖ అధికారిగా శ్రీశుభమ్ బాధ్యతలు చేపట్టారు.

కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న శ్రీశుభమ్

రబీ సాగుకు నీటి కష్టాలు..!

ఆక్రమణలతో బక్క చిక్కిన బోదెలు

దమ్ములకు సైతం నీరు లేక

ఎండుతున్న పొలాలు

కనీసం పూడికతీత చేపట్టాలంటున్న రైతులు

పెనుమంచిలిలో దమ్ములకు సైతం నీరు లేక ఎండుతున్న పొలాలు

ప్రజాశక్తి - ఆచంట

దాళ్వా ఆరంభంలోనే రైతులకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. కాల్వ శివారు ప్రాంత భూములకు సాగునీరు సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. చేలలో వరి మోడులు కుళ్లేందుకు వీలుగా సాలు దమ్ము చేయాల్సి ఉంది. అయితే పంట కాలువల్లో నీటిమట్టాలు పడిపోవడంతో దమ్ము చేసే పరిస్థితి కన్పించడం లేదు. పంట బోదెలు పూడుకుపోవడం, ప్రధాన కాలువ నుంచి పిల్ల కాలువలకు పూర్తిస్థాయిలో నీరు విడుదల కాకపోవడంతో చేలు తడవని దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కొందరు రైతులు ఆయిల్ ఇంజిన్లను అద్దెకు తెచ్చుకుని బోదెలోని నీటిని తోడి దమ్ము చేయాల్సిన పరిస్థితి కన్పిస్తోంది. కొన్నిచోట్ల డ్రెయిన్లపై అడ్డుకట్టలు తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నారు.

ఆచంట వేమవరం ఇసుక గురువులో పంట కాలువలో చెత్తాచెదారం

అడుగంటుతున్న పంట కాలువలు

ప్రధాన కాలువల నుంచి తగినంత నీరు విడుదల కాకపోవడంతో మండలంలోని జగ్గరాజు, కోడేరు కెనాల్, దేవ కాలువల్లో నీరు అడుగంటింది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. దాళ్వా సీజన్ ప్రారంభంలోనే నీరందకపోతే పంట చేతికొచ్చే దశలో పరిస్థితి ఎలాగుంటుందోననే ఆందోళన రైతుల్లో నెలకొంది. కాల్వల ద్వారా శివారు భూములకు నీరు చేరేలా విధంగా బోదెల తవ్వకం పనులు చేపట్టాలని కోరుతున్నారు. అదే సమయంలో కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆచంట మండలంలో ఆచంట, కొడమంచిలి, వల్లూరు, కందరవల్లి, కరుగోరుమిల్లి, శేషమ్మచెరువు, పెదమల్లం తదితర గ్రామాల పరిధిలో పంట బోదెలు, కాలువలు ఆక్రమణలతో నిండిపోయాయనే ఆరోపణలున్నాయి. దీంతో ఆయా గ్రామాల పరిధిలోని శివారు భూములకు సాగునీరు చేరడం కష్టంగా మారింది. వల్లూరు, దేవ, ఆచంట-2 ఛానల్, కందరవల్లి, భీమలాపురం ఛానల్, కొఠాలపర్రు ఛానల్, జగ్గరాజు ఛానల్, ఇలపర్రు ఛానల్, పోరా కాలువల పరిధిలో ఆయకట్టు రైతుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రైతులకు పుష్కలంగా సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.



కొడమంచిలిలో ఇంజన్ ద్వారా తోడుతున్న నీరు

నీటి కష్టాలు ఎలా అధిగమించాలి

జి.సూర్యనారాయణ, ఇసుక గురువు కౌలురైతు, ఆచంట వేమవరం

పంట కాల్వల శివారు భూములకు సాగునీరు సక్రమంగా అందకపోవడంతో ఆయిల్ ఇంజిన్లు ఉపయోగించుకోవాల్సి వస్తోంది. దీంతో అదనపు ఖర్చు తప్పడం లేదు. నీటి కష్టాలను ఎలా అధిగమించాలో అర్థం కావడం లేదు. కాలువల్లో చెత్తా చెదారం వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో శివారు భూములకు సాగునీరు అందక ఇంజన్ల ద్వారా తోడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదనపు ఖర్చుతోపాటు అదనంగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తుంది.

తాగు, సాగునీరు కలుషితం

సత్యనారాయణ, రైతు, ఆచంట వేమవరం ఇసుక గురువు

పంట కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది. తాగునీటి చెరువులకు ఈ నీరే వస్తుంది. ఈ నేపథ్యంలో సాగు, తాగునీరు కలుషితమవుతోంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి కాలువల ప్రక్షాళన చేపట్టాలి.

మహిళా ఓటర్లే అత్యధికం

జిల్లాలో 16,37,555 మంది ఓటర్లు

పురుషులు 7,99,283,

మహిళలు 8,38,146 మంది

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సంక్షిప్త సవరణ 2025 షెడ్యూల్ ప్రకారం ఏలూరు జిల్లాకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి విడుదల చేశారు. నియోజకవర్గాలవారీగా మొత్తం ఓటర్లు, సర్వీసు ఓటర్ల వివరాలను అందులో పొందుపర్చారు. జిల్లాలో 16,37,555 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో పురుష ఓటర్లు 7,99,283 మంది, మహిళా ఓటర్లు 8,38,146 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 126 మంది ఉన్నారన్నారు. వీరుగాక 678 మంది సర్వీసు ఓటర్లుగా నమోదై ఉన్నారన్నారు.

జిల్లాలోని ఉంగుటూరు నియోజకవర్గంలో 1,01,586 మంది పురుష ఓటర్లు, 1,04,914 మంది మహిళా ఓటర్లు, ఆరుగురు థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,06,506 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 193 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు. దెందులూరు నియోజకవర్గంలో 1,09,181 మంది పురుష ఓటర్లు, 1,15,318 మంది మహిళా ఓటర్లు, ఎనిమిది మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,24,507 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 101 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు.

ఏలూరు నియోజకవర్గంలో 1,12,032 మంది పురుష ఓటర్లు, 1,22,447 మంది మహిళా ఓటర్లు, 47 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,34,526 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 115 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు. పోలవరం (ఎస్‌టి) నియోజకవర్గంలో 1,22,961 మంది పురుష ఓటర్లు, 1,31,381 మంది మహిళా ఓటర్లు, తొమ్మిది మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,54,351 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 68 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు. చింతలపూడి (ఎస్‌సి) నియోజకవర్గంలో 1,34,171 మంది పురుష ఓటర్లు, 1,38,705 మంది మహిళా ఓటర్లు, 41 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,72,917 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 72 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు. నూజివీడు నియోజకవర్గంలో 1,18,055 మంది పురుష ఓటర్లు, 1,20,868 మంది మహిళా ఓటర్లు, 10 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,38,933 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 50 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు. కైకలూరు నియోజకవర్గంలో 1,01,297 మంది పురుష ఓటర్లు, 1,04,513 మంది మహిళా ఓటర్లు, ఐదుగురు థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,05,815 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 79 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.

పశ్చిమలో ఓటర్లు 14,70,852

తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ-2025 ప్రక్రియ అనంతరం ఓటర్ల తుది జాబితాను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం ప్రకటించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 షెడ్యూల్ ప్రకారం తుది ఓటర్ల జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాలు, తదితర కార్యాలయాల్లో ప్రచురించారు. జిల్లాలోని మొత్తం 1,461 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ప్రస్తుతం 14,70,852 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. వీరిలో పురుష ఓటర్లు 7,20,597 మంది, మహిళలు 7,50,179గా నమోదయ్యారు. థర్డ్ జెండర్ 76 మంది ఉన్నారు. గతేడాది అక్టోబరు 29న ప్రచురించిన ముసాయిదా జాబితాలో 14,71,189 మంది ఓటర్లు ఉండగా సవరణల అనంతరం తుది జాబితా నాటికి సుమారు 337 మంది ఓటర్లు తగ్గారు. అత్యధికంగా భీమవరం నియోజకవర్గంలో 2,52,255 మంది ఓటర్లు ఉండగా, అతి తక్కువగా నరసాపురం నియోజక వర్గంలో 1,70,683 మంది ఉన్నారు. అలాగే సర్వీస్ ఓటర్లు జిల్లాలో మొత్తం 888 మంది ఉండగా వారిలో 868 మంది పురుషులు, 20 మంది స్త్రీలు ఉన్నారు. ఎప్పటిలాగే జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉన్నారు.

పరిశీలిస్తున్న వైద్య బృందాలు

సదరం సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

ప్రజాశక్తి - దెందులూరు

జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా వికలాంగుల సదరం సర్టిఫికెట్ల పరిశీలన సోమవారం ప్రారంభమైంది. ప్రభుత్వం పరిశీలనకు కేటాయించిన గుంటూరు, విజయవాడ, ఒంగోలు నుండి విచ్చేసిన ప్రభుత్వ వైద్యులు దెందులూరు మండలంలో 60 మంది ఫించన్‌దారుల ఇళ్లకు వెళ్లి వారి అర్హతను పరిశీలించారు. వైద్యులు బృందాలుగా ఒక బృందం కొవ్వలి నుండి, రెండో బృందం సోమవరప్పాడు నుండి, మూడో బృందం దెందులూరు నుండి పరిశీలన ప్రారంభించింది. రోజువారీ పరిశీలన నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, డిసిహెచ్‌ఎస్ సతీష్, ఎంపిడిఒ శ్రీదేవి పాల్గొన్నారు.

అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

పిజిఆర్‌ఎస్‌కు 276 అర్జీలు

ప్రజాశక్తి - ఏలూరు

పిజిఆర్‌ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) ద్వారా అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జరిగిన జిల్లాస్థాయి పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో ఆమె జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. జిల్లాలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అందిన అర్జీలను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించి నాణ్యమైన ఎండార్స్‌మెంట్ అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో 276 అర్జీలు స్వీకరించామని చెప్పారు. జిల్లా అధికారులు తమ శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏలూరుకు చెందిన పాలా వెంకటరమణ దివ్యాంగుల పెన్షన్ రూ.ఆరు వేల నుంచి రూ.15 వేలకు పెంచాలని అర్జీ అందజేశారు. మండవల్లి మండలం కొవ్వూరుకు చెందిన గుడివాడ ఇందిర తన అనుమతి లేకుండా తన భూమిని చెరువుగా మార్చిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ముసునూరు మండలం వేల్పుచర్ల గ్రామానికి చెందిన గరికిముక్కు భవాని ప్రభుత్వ కాలేజీలో బిఎస్‌సి నర్సింగ్ సీటు ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం గ్రామానికి చెందిన కుప్పా వెంకట్రావు తన వ్యాపార స్థలం పక్కనే పెంటకుప్ప వేసి పరిసర ప్రాంతాల వారికి దుర్వాసన వచ్చి అసౌకర్యంగా ఉందని పెంటకుప్పను తొలగించాలని అర్జీ అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ వద్ద తనను కలిసి విజ్ఞప్తులను అందించిన ప్రజల నుండి కూడా వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో వివిధ పోస్టులకు సంబంధించి ఖాళీలు భర్తీ చేయాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కలెక్టర్ కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వీరితోపాటు పలువురు ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రాలు సమర్పించారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

విద్యుత్ భారాలు ఉపసంహరించాలి

సానా రుద్రవరంలో విద్యుత్ బిల్లుల దహనం

ప్రజాశక్తి - కలిదిండి

విద్యుత్ బిల్లులను ఉపసంహరించాలని కోరుతూ మండలంలోని సానా రుద్రవరంలో సిపిఎం ఆధ్వర్యాన సోమవారం విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. విద్యుత్ భారాలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను నిలుపుదల చేయాలని నినదించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జె.మహేష్, సిహెచ్.శ్రీకాంత్, బి.సురేష్, ఎ.శేఖర్, డి.రమణ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సిపిఎం నేతలు

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జరుగుతున్నాయి. నగరంలోని జిల్లా పోలీసు మైదానంలో గత పది రోజులుగా పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులు నిర్వహించారు. టెస్టుల్లో భాగంగా 600 మంది అభ్యర్థులకు హాల్‌టికెట్లు మంజూరు చేయగా వారిలో 396 మంది ఈ ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులకు హాజరయ్యారు. వారిలో 253 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఈ ఫిజికల్ టెస్టులు మరో మూడు రోజులు నిర్వహించనున్నారు. అనివార్య కారణాలవల్ల ఈ ఫిజికల్ టెస్టులకు హాజరుకాని అభ్యర్థులు ఎవరైనా ఉంటే వారు ఈ నెల తొమ్మిదో తేదీన నిర్వహించే పరీక్షలకు హాజరై ఫిజికల్ టెస్టులు నిర్వహించుకోవాలని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ సూచించారు. సోమవారం నిర్వహించిన ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

దేహదారుఢ్య పరీక్షల్లో కానిస్టేబుల్ అభ్యర్థులు

నాలుగో నేత్రంతో నేరాలను అరికడదాం

డ్రోన్ల వినియోగించేందుకు ప్రణాళిక

పోలీసింగును మరింత సులభతరం చేసేందుకు రంగం సిద్ధం

అవగాహనా కార్యక్రమంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో పోలీస్ శాఖ మరో మైలురాయిని తాకేందుకు సిద్ధంగా ఉందని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. ఆధునిక పరిజ్ఞాన నాలుగో నేత్రం సహాయంతో ఓవైపు ట్రాఫిక్‌ను, మరోవైపు నగరంలో శాంతిభద్రతలు లోపించిన సమయంలో వేగంగా స్పందించేందుకు, ఇంకోవైపు గుమ్మిగుడిన జనాలను చదరగొట్టేందుకు ఇలా అనేక రకాలుగా డ్రోన్ల వినియోగంతో పోలీసింగును మరింత సులభతరం చేసేందుకు రంగం సిద్ధం చేశామని చెప్పారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఐడియా ఫోర్జ్ అనే డ్రోన్ల కంపెనీతో జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ పాల్గొన్నారు. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లకు చెందిన ఎస్‌ఐలు, సిఐలు, నగరంలోని ఎస్‌ఐలు, సిఐలు ఈ కార్యక్రమంలో పాల్గొని అవగాహన పొందారు. ఆధునిక సమాజంలో ఎక్కువవుతున్న నేరాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా డ్రోన్ల సహాయం పొందుతున్నారు. పలు రాష్ట్రాల్లోని ప్రముఖ నగరాల్లో కొంతమేర ఈ డ్రోన్ల వినియోగం జరుగుతుంది. ఈ డ్రోన్ల వినియోగం ప్రస్తుతం ఏలూరు జిల్లాకు రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ మోనిటరింగ్ చేసేందుకు ముఖ్యమంత్రి, మంత్రులు ప్రయాణించే మార్గాల్లో నిరంతరం పర్యవేక్షించేందుకు, వారి కదలికలను ఎప్పటికప్పుడు గుర్తించేందుకు, గుంపుగా సంచరించే సమయాల్లో వారిని చెదరగొట్టేందుకు, వరదలు ముంపులు వచ్చినప్పుడు నష్టాన్ని అంచనా వేయడానికి, చిక్కుకున్న వ్యక్తులను గుర్తించేందుకు ఈ డ్రోన్ల వినియోగం తోడ్పడుతుంది. సరిహద్దు చెక్‌పోస్టులలో పెట్రోలింగ్ నిర్వహించేందుకు, మానవ అక్రమ రవాణా వంటి ఘటనలు జరిగినప్పుడు నేరుగా పోలీసులు చేరుకోలేని ప్రాంతాల్లో సైతం ఈ డ్రోన్లు చేరుకుని ఆ ప్రాంతంలో ఉన్న పరిస్థితులను నేరుగా విజువల్ రూపంలో వీరికి చూపిస్తుంది. రాత్రి వేళల్లో థర్మల్ స్క్రీనింగ్ ఇమేజ్ సిస్టం ద్వారా నిందితుల కదలికలు గుర్తించడం ఈ డ్రోన్ల ప్రత్యేకత. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగిన సమయాల్లో అపార్ట్‌మెంట్‌లో ఇరుక్కుపోయిన వారిని గుర్తించేందుకు కూడా ఈ డ్రోన్లు ఉపయోగపడతాయన్నారు. పెద్ద తరహా డ్రోన్ల ద్వారా బరువు కలిగిన సామగ్రిని సైతం పంపించేందుకు వీలుంటుందన్నారు. పోలీసింగ్‌కు ఇది అత్యంత వినియోగకరంగా ఉంటుందన్నారు. ఒకవేళ ఏదైనా నేరం జరిగినప్పుడు నిందితుడి వాహన వివరాలు మనకు తెలిస్తే వెంటనే ఈ సమాచారాన్ని ఇస్తే ఆ వాహనం ఎన్ని వాహనాల మధ్య ఉన్న ఈ డ్రోన్ ఆ వాహనాన్ని గుర్తిస్తుందన్నారు. ఆ వాహనాన్ని పట్టుకోవడం చాలా సులభతరం అవుతుందన్నారు. ట్రాఫిక్ జామ్‌లో ఎక్కడికైనా పోలీసు సిబ్బంది వెళ్లేందుకు కొంత ఆలస్యమైనప్పటికీ, ఈ డ్రోన్‌ను ఆ ప్రాంతానికి పంపించి అక్కడ చోటు చేసుకుంటున్న స్థితిగతులపై ముందే అవగాహన పొందవచ్చని, ఈ డ్రోన్లు నేరుగా ఫోన్లకు సమాచారాన్ని ఇస్తాయని తెలిపారు. నిమిషాల వ్యవధిలో ఆ ప్రాంతానికి మనం చేరుకుని అక్కడి సమాచారాన్ని ముందుగానే తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఈ డ్రోన్లను ఐడియా ఫోర్జ్ కంపెనీ ద్వారా మన జిల్లాకు దిగుమతి చేసుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నామని తెలిపారు. దానికి సంబంధించిన టెక్నికల్ టీమ్ ఎంతో దూరం నుంచి ఇక్కడికి చేరుకుని పూర్తిస్థాయిలో డెమో చూపించేందుకు కృషి చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. లైవ్ డెమోలో ఒక వాహనాన్ని చాలా దూరం వెంబడించి, దాని సమాచారాన్ని ఈ డ్రోన్ల సహాయంతో తెలుసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, జిల్లా అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, డిఎస్‌పిలు శ్రావణ్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, సిఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంపై అవగాహన పొందుతున్న సిబ్బంది

ఆక్రమణలు తొలగించేందుకు డ్రోన్లు ముఖ్యపాత్ర

ఆక్రమణకులకు గురైన చెరువులను రక్షించేందుకు, ఆక్రమణలను తొలగించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, ఈ ప్రణాళికలో డ్రోన్లు ముఖ్యపాత్ర పోషించబోతున్నాయని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఏర్పాటు చేసిన డ్రోన్ సమ్మేట్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో అనేక అక్రమ కట్టడాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని వేగంగా పరిష్కరించేందుకు కచ్చితంగా డ్రోన్ల సహాయంతో మానిటరింగ్ చేసేందుకు వీలవుతుందని ఆమె అన్నారు. అంతేకాకుండా తాను వచ్చిన నాటి నుంచి జిల్లాలో ఉన్న అక్రమ కట్టడాలు ఎంక్లోస్ మెంట్ లపై ప్రత్యేక దృష్టి సారించానని తెలిపారు. 2002, 2003 సంవత్సరాల్లో ఏలూరు నగర, జిల్లా బ్లూ ప్రింట్లను తీసుకుని అప్పట్లో ఉన్న వాస్తవ పరిధి ప్రకారం చెరువులు, కుంటలు ఏ మేరకు ఆక్రమణకు గురయ్యాయో తెలుసుకుని తన పనిని మొదలు పెడతానన్నారు. ఈ పనికి కచ్చితంగా డ్రోన్లను వినియోగిస్తామని తెలిపారు.

సిద్ధార్థలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశేషంగాఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

ముగ్గులు, నృత్య పోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

శ్రీ సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు ఆధ్వర్యంలో సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా సంక్రాంతి శోభ ఉట్టిపడేలా స్థానిక సిద్ధార్థ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో సంక్రాంతి సంబరాల్లో మునిగి తేలారు. ముగ్గుల పోటీలు, నృత్యాల పోటీ లతో కళాశాల ఆవరణం అంతా సందడి నెలకొంది. విద్యార్థులు పంచెకట్లు, పల్లెపడుచుల వేషధారణలతో హోయలొలికించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలుగా ప్రథమ బహుమతి ఎం.మధురిమ, ద్వితీయ బహుమతి వై.హారిక, తృతీయ బహుమతి టి.గీతా సుధాత్రి, కన్సోలేషన్ బహుమతి రోజ్‌మేరి అనే విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ప్రధానాచార్యులు జి.శ్రీమన్నారాయణ, అధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు

భగత్‌సింగ్ కాలనీలో పర్యటిస్తున్న సిపిఎం నేతలు

సిమెంట్ రోడ్లు మంజూరు చేయాలి

భగత్ సింగ్ కాలనీలో సిపిఎం నేతల పర్యటన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోరాటాలు చేసి సాధించిన జీలుగుమిల్లిలోని భగత్ సింగ్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సిపిఎం జీలుగుమిల్లి కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం నాయకులు కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కమిటీ సభ్యులు కొండలరావు, అప్పారావు మాట్లాడుతూ ఇటీవల పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా పలు రహదారులకు సిమెంట్ రోడ్లను మంజూరు చేశారని, భగత్ సింగ్ కాలనీకి ఒక్క రోడ్డు కూడా వేయకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భగత్ సింగ్ కాలనీలో సిమెంట్ రోడ్లను వేసి కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు సూర్యకుమారి, మణి, రామకృష్ణ, సీత పాల్గొన్నారు.

దావీదు మృతదేహానికి నివాళులర్పిస్తున్న యూనియన్ సభ్యులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

ఫ్రెండ్స్ ఆటో యూనియన్ (సిఐటియు అనుబంధం)లో సమస్యల పరిష్కారానికి, సభ్యులకు సహాయ సహకారాలు అందించేందుకు ఎప్పుడూ ముందుంటామని ఆ యూనియన్ ప్రెసిడెంట్ కురిమెళ్ల శ్రీను తెలిపారు. ఫ్రెండ్స్ ఆటో యూనియన్ సభ్యుడు అర్జా దావీదు మృతి చెందాడు. సోమవారం ఆటోలు పక్కన పెట్టి దావీదు ఇంటి వద్దకు వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపి దహన సంస్కార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఫ్రెండ్స్ ఆటో యూనియన్ తరపున వారి కుటుంబానికి రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు, సిపిఎం మండల నాయకులు ధర్ముల రమేష్, నాళ్ల సిరిసూరి, పాషా, మజ్జి శ్రీను, కమ్మసిచ్చు రమేష్, బీరం అంజి, లక్ష్మణ్, 50 మంది యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తల్లి మందలించిందని...

ప్రజాశక్తి - టి.నరసాపురం

తల్లి మందలించిందని మనస్తాపానికి గురైన వ్యక్తి కలుపు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సాయంపాలెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సాయంపాలెం గ్రామానికి చెందిన పులగర పిచ్చియ్యకు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. పిచ్చియ్య మద్యానికి బానిస కావడంతో రెండేళ్ల క్రితం భార్య ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. పిచ్చియ్యలో ఎంతకీ మార్పు రాలేదు. ఈ నెల మూడో తేదీన మద్యం తాగి వచ్చిన పిచ్చియ్యను తల్లి మందలించడంతో కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు అతడిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమింగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల ఐదో తేదీన మృతి చెందాడు. మృతుని తల్లి సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపారు.

నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు

విద్యుదాఘాతంతో తాపీ కార్మికుడికి గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

హోటల్ నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురైన తాపీ కార్మికుడు గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...పట్టణ పరిధిలోని ఎంఆర్.అప్పారావు కాలనీకి చెందిన తాపీ కార్మికుడు పందిరిపల్లి శివ కొన్ని రోజుల నుంచి విజయవాడ రోడ్డులో ఉన్న ఓ ప్రయివేట్ స్కూల్ ఆవరణలో హోటల్ నిర్మాణ పనులు చేస్తున్నాడు. రోజువారి లానే సోమవారం కూడా తాపీ పనులకు హాజరై ప్లాస్టింగ్ పనులను చేస్తున్నాడు. పని చేస్తుండగా పక్కనే ఉన్న 33/11 కెవి విద్యుత్ తీగ చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. ఇది గమనించిన తోటి కార్మికులు అతడిని 108కి ఫోన్ చేసి అంబులెన్సులో హుటాహుటినా నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

పట్టుబడిన వెదురు కలప ట్రాక్టర్

వెదురు కలప ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పి.రాజవరం అటవీ శాఖ బీట్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున అటవీ శాఖధికారులు తనిఖీలు చేపట్టారు. అడవిలో నుంచి వెదురు కర్రలను అక్రమంగా నరికి ట్రాక్టర్‌లో పొగాకు బ్యారన్ల దగ్గరకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి ధర్మారావు తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని ట్రాక్టర్‌ను జంగారెడ్డిగూడెం అటవీశాఖ రేంజ్ కార్యాలయనికి తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో బీట్ అధికారులు మారేష్, లలిత సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అధ్వానంగా రోడ్డు.. ప్రజల ఇబ్బందులు

గోతులమయంగా పొంగుటూరు-నిడదవోలు రోడ్డు
ప్రమాదాల బారిన వాహనదారులు

రోడ్డుపై ఉన్న భారీ గొయ్యి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పొంగుటూరు నుంచి నిడదవోలు వరకు ఉన్న రాష్ట్ర హైవే రహదారి అధ్వానంగా ఉంది. ప్రజలు ఆ దారిలో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు అధ్వానంగా దుమ్ము, ధూళి వాహనదారుల కళ్లల్లో పడటంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేకాకుండా పలు అనారోగ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో గోతులు నిండిపోయి జిగురు మట్టి అవ్వడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఈ హైవేకు కొత్త రహదారి నిమిత్తం గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం చాలా ప్రాంతాల్లో కొత్త రహదారుల నిర్మాణం చేపడుతుంది. ప్రాధాన్యత దృష్ట్యా పొంగుటూరు-నిడదవోలు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించకుండా ఏం చేస్తున్నారు..!

ఇంకా ఎన్నేళ్లు ఎదురుచూడాలి
గ్రామసభలో అధికారులను నిలదీసిన గ్రామస్తులు


గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - మండవల్లి

మూడున్నర సంవత్సరాలుగా సమస్యల పరిష్కారానికి ఎదురుచూస్తున్నామని, నేటికీ సమస్యల పరిష్కారం చూపకుండా ఏం చేస్తున్నారని ఇఒపిఆర్‌డి శేఖర్, ఇన్‌ఛార్జి కార్యదర్శి సాయిప్రదీప్‌లపై గ్రామస్తులు ధ్వజమెత్తారు. ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు తలలు పట్టుకున్నారు. మండల కేంద్రమైన మండవల్లి గ్రామసభ సర్పంచి మెండ ఝాన్సీ అధ్యక్షతన సోమవారం స్థానిక నాగేంద్రస్వామి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు గ్రామంలో నెలకొన్న సమస్యల చిట్టాను అధికారుల ముందు ఉంచారు. మేజర్ పంచాయతీకి గ్రేడ్ 5 కార్యదర్శిగా గ్రామానికి చెందిన వ్యక్తిని ఎలా నియమించారని ప్రశ్నించారు. గతంలో గ్రామసభల అర్జీలను ఎన్ని పరిష్కరించారో చెప్పాలని, మూడు సంవత్సరాల క్రితం వచ్చిన జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలో ఎన్ని కుళాయిలు ఇచ్చారని, తరుగుమూల ఇళ్ల స్థలాలను మెరక చేయాలని కోరుతూ గత 19 ఏళ్ల నుంచి అర్జీలను ఇస్తూనే ఉన్నామన్నారు. పంచాయతీ రోడ్లు, రహదారులు, స్థలాలు, ఆక్రమణకు గురవుతున్నా ఎందుకు పట్టించుకోవడంలేదని, సీసీ రోడ్లపై సీసీ రోడ్లు వేస్తూ నిధులను ఎందుకు దుర్వినియోగం చేస్తున్నారని, దళితుల శ్మశాన వాటికకు ఫెన్సింగ్ గేట్ ఏర్పాటు, దళితవాడలో బట్టలు ఉతుక్కోవడానికి రేవు, డ్రెయినేజీ, లోతట్టు ప్రాంత రహదారుల అభివృద్ధిపై ఏం చర్యలు తీసుకున్నారని నిలదీశారు. ఇంకా ఎన్నేళ్లు ఎదురుచూస్తే సమస్యలు పరిష్కరిస్తారన్నారు. పరిష్కారం చేసే ఉద్దేశం ఉందా లేదా అంటూ నిలదీశారు. దీనిపై కార్యదర్శి పొంతనలేని సమాధానం చెప్పడంతో గ్రామసభ గందరగోళంగా రసాభాసగా మారింది. ఇఒపిఆర్‌డి శేఖర్ సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కారయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వండని గ్రామస్తులు ప్రశ్నించగా హామీలు ఇవ్వలేమని, యుపిఆర్‌డిగా ఎక్కడ ఉంటామో లేదో మాకే తెలియదని సమాధానం చెప్పాడు. అలాంటప్పుడు గ్రామసభలు నిర్వహించడం ఎందుకని యుపిఆర్‌డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.25 లక్షల పైబడి ఉన్న బకాయిలను ఎందుకు వసూలు చేయడం లేదని నిలదీశారు. మండవల్లిలో సమస్యలు భారీ స్థాయిలో తిష్టవేశాయని అర్థమవుతుందని, ఉన్నంతవరకు సమస్యలను పరిష్కరించుకుందామని, అందుకు సహకరించాలని ఆయన కోరుతూ గ్రామసభను ముగించారు.

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ఈదేపల్లిలో గ్రామ రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి - ముదినేపల్లి

భూ సమస్యల పరిష్కారానికి గ్రామ రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహశీల్దార్ జెఎస్.సుభాని అన్నారు. మండలంలోని అల్లూరు, ఈదేపల్లి గ్రామాల్లో సోమవారం గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సుభాని మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు, రైతుల నుంచి వచ్చిన అర్జీలను తీసుకున్నామని, వాటిని సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని, ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ రెండు సదస్సుల్లో 11 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి పి.శ్రీనివాస్, రీసర్వే డిటి ప్రసాద్, ఆయా గ్రామాల సర్పంచులు అబ్బిశెట్టి వెంకటేశ్వరరావు, శీలం రామకృష్ణ, విఆర్ఓ టి.శ్రీరాములు పాల్గొన్నారు.

వైవాక గ్రామసభలో 99 అర్జీలు స్వీకరణ

జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని వైవాకలో సోమవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ పరిధిలోని అసైన్డ్ భూముల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. గ్రామ పరిధిలో వందలాది ఎకరాలు అసైన్డ్ భూముల్లో 120 ఎకరాలను స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించి గతంలో పట్టాలిచ్చారు. అనంతరం ఆ భూములు పలు చేతులు మారాయి. ఆ భూములపై వివాదాలు కూడా తలెత్తాయి. 2016లో అసైన్డ్ భూములను చట్ట ప్రకారం 22ఎ సెక్షన్‌లో చేర్చి క్రయవిక్రయాలపై నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో అనుభవదారుల నుంచి వచ్చిన వినతి మేరకు ఈ భూములపై విచారణ జరిపి హక్కుదారులను వ్యక్తిగతంగా గుర్తించేందుకు హక్కు పత్రాలు పరిశీలించేందుకు ఏర్పాటుచేసిన గ్రామసభలో 99 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ సుభాని తెలిపారు. ఈ ప్రత్యేక గ్రామసభలో పెదపాడు తహశీల్దార్ కృష్ణజ్యోతి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


వైవాకలో ప్రత్యేక గ్రామసభ

అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీలను త్వరగా పరిష్కరించాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నూజివీడు డివిజన్ పరిధిలో మొత్తం 12 అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ అర్జీలను సంబంధిత అధికారులకు పంపి గడువులోపులోగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. అర్జీలు పరిష్కారం కాకపోతే ఎందుకు పరిష్కారం కాలేదో వివరణ కూడా గడువు లోగా ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కార్డులు అందిస్తున్న సిబ్బంది

ప్రతి ఇంటికీ ఉపాధి హామీ కార్డు

ఎంపిడిఒకు మీర్జాపురం వాసుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పరిధిలోని మీర్జాపురం గ్రామంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో అనేక అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీంతో స్పందించిన అధికారులు ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇకపై ఎటువంటి అవకతవకలు జరగకుండా క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ప్రతి ఇంటికీ ఉపాధి హామీ కార్డు అందించారు. ఆ కార్డు ఉంటే ఎటువంటి అవకతవకలకు ఆస్కారం ఉండదనే ఉద్దేశంతో ఎంపిడిఒ మీర్జాపురం గ్రామంలో ప్రతి ఒక్క ఇంటికీ ఉపాధి హామీ కార్డు అందించాలని ఆదేశించారు. మండలంలోని మహిళా పోలీసులకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు సోమవారం మీర్జాపురంలో డ్యూటీ వేశారు. ఈ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మీర్జాపురం గ్రామ సర్పంచి గోళ్ల పద్మ గ్రామ పెద్దల సమక్షంలో ప్రారంభించారు. దీనివల్ల భవిష్యత్తులో ఎప్పుడూ కూడా ఎవరి పనికి తగ్గ వేతనం వాళ్ల ఖాతాలో నేరుగా పడటం వల్ల ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉంటుందన్నారు. నూజివీడు ఎంపిడిఒ రాఘవేంద్రనాథ్‌కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నగరంలో అభయ రక్షక దళం గస్తీ

విద్యార్థులతో మాట్లాడుతున్న అభయ రక్షక దళం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పార్కుల్లో జంటలుగా తిరుగుతున్న విద్యార్థులను అభయ రక్షక దళ టీమ్ హెచ్చరించింది. నగరంలో సోమవారం సాయంత్రం అభయ రక్షక దళం గస్తీ నిర్వహిస్తున్న సమయంలో నగరంలోని జన్మభూమి పార్క్‌లో కళాశాల విద్యార్థుల జంటలుగా కనిపించారు. దీంతో అభయ రక్షక దళ టీమ్ ఏలూరు ఇన్‌ఛార్జి ఎస్ఐ క్రాంతిప్రియ వారిని ఎవరని, ఎక్కడ నుంచి వచ్చారని ప్రశ్నించారు. వారు వారి పేర్లను తప్పుగా చెప్పారు. వెంటనే ఎస్ఐ క్రాంతిప్రియ కళాశాల ఇన్‌ఛార్జిలను జన్మభూమి పార్క్ ప్రాంతానికి పిలిపించారు. వారిని కళాశాల సిబ్బంది గుర్తించారు. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేస్తామని క్రాంతిప్రియకు వారు తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృత్తమైనా, తమ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఎవరైనా ఇటువంటి బహిరంగ ప్రదేశాలలో తారసపడినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కళాశాల సిబ్బంది క్రాంతిప్రియను కోరారు. అనంతరం క్రాంతిప్రియ వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

మాట్లాడుతున్నమండవల్లి ఎస్ఐ రామచంద్రరావు

ప్రజాశక్తి - మండవల్లి

సంక్రాంతి పండుగ సంప్రదాయ ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు తెర తీస్తే సహించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామచంద్రరావు హెచ్చరించారు. ఎస్పి ప్రతాప్‌శివకిషోర్ ఆదేశాల మేరకు పులపర్రులో సంక్రాంతిని పురస్కరించుకుని సోమవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు, యువత కోడిపందేలకు, జూదాలకు దూరంగా ఉండాలన్నారు. సంప్రదాయ ముసుగులో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పేకాట, కోడిపందేలకు బదులుగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడలు నిర్వహించుకుని సంక్రాంతి పండుగను కుటుంబాలతో సంతోషంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ సంక్రాంతి ప్రతి కుటుంబంలో నూతన కాంతులు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా కలగాలని ఆకాంక్షించారు.

కలిదిండి : జూద క్రీడలకు దూరంగా ఉండాలని ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో మండల పరిధిలోని గ్రామ కమిటీలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూద క్రీడలకు ప్రత్యామ్నాయంగా సాంప్రదాయ క్రీడలైన క్రికెట్, వాలీబాల్, కోకో, ముగ్గుల పోటీలు వంటివి నిర్వహిస్తూ యువతను ప్రోత్సహించాలన్నారు. కోడిపందేలు, పేకాట వంటి జూదాలకు దూరంగా ఉండాలన్నారు. లేకుంటే ఆయా జూదాల్లో పాల్గొన్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో స్టేషన్ సిబ్బంది, గ్రామ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

దళిత హక్కుల పరిరక్షణ సంఘం మండలాధ్యక్షునిగా బిక్షాలు


సమావేశంలో పాల్గొన్న దళితులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

దళిత హక్కుల పరిరక్షణ సంఘం ముదినేపల్లి మండలాధ్యక్షునిగా నిమ్మగడ్డ బిక్షాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముదినేపల్లిలో సోమవారం దళితులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దళిత హక్కుల పరిరక్షణ సంఘం మండల సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా డి.నాగమల్లేశ్వరరావు ఎస్.వరప్రసాదరావు, ఉపాధ్యక్షులుగా బేతపూడి వెంకటరమణ, ఎల్.ఆంజనేయులు, ఎస్.సుధాకర్, డి.రంగారావు పి.నరసింహరావు, గౌరవ సలహాదారులుగా ఎ.కిషోర్, డి.కోటేశ్వరరావు, జి.శ్రీకాంత్, కె.ప్రవీణ్, జి.జ్ఞానప్రసాద్, కె.గౌతమ్, కార్యదర్శిగా పాగోలు విజయసాగర్, జాయింట్ సెక్రెటరీలుగా ఎం.మురళి, ఎం.ఫణింద్ర, కె.సుధీర్‌బాబు, ఎ.మోహన్‌రావు, కోశాధికారిగా జి.సమూయేలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బిక్షాలు మాట్లాడుతూ మండలంలోని దళితులకు ఏ సమస్య, ఏ కష్టం వచ్చినా లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా, న్యాయంగా, ఆర్థికంగానూ సహాయం చేయాలని, పార్టీలకు అతీతంగా దళితులంతా ఐకమత్యంగా ఉండాలని చెప్పారు.

10న మండల సమావేశం

ప్రజాశక్తి - ముసునూరు

ఈ నెల పదో తేదీన మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల పదో తేదీన మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కొండా దుర్గాభవాని ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని 16 గ్రామ పంచాయతీల ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, మండల శాఖ అధికారులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా దుర్గాప్రసాద్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మండవల్లి

టిడిపి కూటమి నాయకులు, భైరవపట్నం గ్రామ ప్రముఖులు చాపరాల దుర్గాప్రసాద్ పుట్టినరోజు వేడుకలు ప్రత్తిపాడు స్టేజి వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన కూటమి నాయకులతో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రము ఖులు మండవల్లి మండలానికి చెందిన అధికారులు కేక్‌ను కట్ చేసి పూలమాలలతో, దుశ్శాలువాలతో ఆయనను ఘనం గా సత్కరించారు. దీంతో ప్రత్తిపాడు స్టేజి వద్ద ఉన్న ఆయన కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాసరావు మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు.

రైతులందరూ విధిగా విత్తన శుద్ధి చేసుకోవాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులందరూ విధిగా విత్తన శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి బి.వేణుమాధవ్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైతులందరూ విధిగా వితన శుద్ధి చేసుకోవాలన్నారు. మినుము పైరులో బంగారు తీగ నివారణకు పెండిమిథలిన్ అనే కలుపు మందును ఎకరానికి 1.5 నుంచి రెండు లీటర్ల వరకు ఇసుకలో కలిపి చల్లుకోవాలన్నారు. రబీ మినుము పైరుకు రైతులందరూ కూడా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, ఎకరానికి రూ.60 ప్రీమియంతో దగ్గరలోనే కామన్ సర్వీస్ సెంటర్‌లో ఇన్సూరెన్స్ చేయించుకోవచ్చని, దానికి సంబంధించి గ్రామ వ్యవసాయ సహాయకుల నుంచి సాగు ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. రైతులందరికీ ధాన్యం కొనుగోలులో అనుసరిస్తున్న నూతన విధానం ద్వారా రైతులకు 24 గంటల్లోనే ధాన్యం కొనుగోలు తాలూకా రొక్కం రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంభించి సాగు ఖర్చును తగ్గించుకొని నాణ్యమైన రసాయన రహిత దిగుబడులను సాధించాలని సూచించారు.

'విద్యుత్ ఛార్జీల భారం జగన్ పాపమే'

ప్రజాశక్తి - ముదినేపల్లి

జగన్ అవినీతి, అసమర్థ పాలన వల్లే విద్యుత్ ఛార్జీల భారమని, ఇది జగన్ పాపాల్లో భాగమేనని టిడిపి కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. సోమవారం ఆయన వడాలిలో మాట్లాడుతూ సుపరిపాలన చేస్తున్న టిడిపి కూటమి ప్రభుత్వంపై ధర్నాలు, అసత్య ప్రచారాలు చేయడం వైసిపి శ్రేణులకు, జగన్‌కు సరికాదన్నారు. విద్యుత్ ఛార్జీల భారం ఎందుకు పడిందో వివరాలతో సహా ప్రజలకు తెలియజేస్తామన్నారు.

మండలం యూనిట్‌గా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని సిపిఐ కుక్కునూరు మండల సమితి కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వెంకటాచారి మాట్లాడారు. ప్రతి ఏటా వర్షాకాలంలో సంభవించే ఇటు గోదావరి వరద అటు శబరి ఉధృతికి కుక్కునూరు మండల ఏజెన్సీ మొత్తం వరదల్లో అతలాకుతలమవుతుందని వాపోయారు. వరద ముంపును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2015లో అప్పటి టిడిపి ప్రభుత్వం రూ.ఆరు లక్షల పైచిలుకు ప్యాకేజీ ప్రకటించిందని, కాగా గత జగన్ ప్రభుత్వం రూ.10 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని నిర్ణయించిందని తెలిపారు. 41 కాంటూరులో ముంపులో ఉన్న గ్రామాలకు కేవలం గిరిజనులకు రూ 6.80 లక్షలు, గిరిజనేతరులకు రూ.6.36 లక్షలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు.

KANAKADURGA FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్: -1st ఫ్లోర్, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
- ఏలూరురోడ్డు, లక్ష్మిథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి
- గ్రౌండ్‌ఫ్లోర్,అక్షరానంద స్కూల్ ఎదురు, ధర్మాజీగూడెం-534462, ఏలూరు జిల్లా.
- 16-225, ఫస్ట్‌ఫ్లోర్, పాతబస్టాండ్ దగ్గర, జివిమాల్ సూపర్ మార్కెట్, మెయిన్‌రోడ్డు, చింతలపూడి. ఫోన్ :9492934845, -DRNO :10-11-5/2 , 1 st Floor, Ganesh Chowk Center , Near Ravindra bharathi school, NIDADHAVOLU
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 26-01-2025 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1754.13 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు #238-4-11, Subbammadevi High School Road, , Opp.Zed Labs, R.R.Peta, Eluru- 534 002. నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
#238-4-11,Subbammadevi High School Road,
Opp.Zed Labs,R.R.Peta, Eluru-534 002.
Contact person, area manager,
p.hemanth kumar-80746-56196